www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 26 డిసెంబర్ 2022

5

తూర్పుగోదావరి



కలెక్టర్‌కు సంయుక్త కార్యదర్శిగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతకి ప్రభుత్వ సంయుక్త కార్యదర్శిగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పలువురు ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు అభినందనలు తెలిపారు. ఉద్యోగోన్నతి పొందినా ఆమె జిల్లాలోనే సేవలు అందించనున్నారు.



హారన్ల మోత

పెరుగుతున్న శబ్ధకాలుష్యం

బైక్‌ల సైలెన్సర్లపై కొరవడిన పర్యవేక్షణ

ఈ-చలానా వచ్చాక స్పెషల్ డ్రైవ్‌లు కరువు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టణ కేంద్రాల్లో జనావాసాల మధ్య వాహనాల శబ్దం హద్దులు మీరుతోంది. కొంతమంది యువత వివిధ హారన్లు వినియోగించడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనాల నుంచి ఆటోల వరకు కొందరు ఆకతాయిలు చేస్తున్నవల్ల ప్రజలు హడలెత్తిపోతున్నారు. పిల్లి అరుపు నుంచి పిల్లాడి ఏడుపు వరకు.. కుక్క మొరిగినట్టు, నక్క మూలిగినట్టు, పులి గాండ్రించినట్టు ఇలా ఒకటేంటి రకరకాల హారన్లు, విసిగిపోయే సైరన్లతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో విచిత్రమైన శబ్దాలు చేసే హారన్లు మోగిస్తూ జనాన్ని విసిగిస్తున్నారు.

జనంలో బుల్లెట్టైక మక్కువ తెలిసిందే. కంపెనీతో వచ్చే సైలెన్సర్లలో శబ్దస్థాయి చాలా తక్కువగా ఉంటుంది. కానీ వాటిని కొనుగోలు చేసినవారిలో చాలామంది తర్వాత భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లు అమర్చుతున్నారు. వాహనాల నుంచి పరిశ్రమల వరకు శబ్దానికి సంబంధించి పరిమితులు ఉన్నప్పటికీ అధికారులు వాటిని పట్టించుకోకపోవడం, ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో ఎవరికి వారు ఇష్టారీతిన శబ్దకాలుష్యానికి కారకులుగా మారుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ నిబంధనలు బేఖాతరు

పర్యావరణ పరిరక్షణ నిబంధనల ప్రకారం ప్రతి వాహనానికి పలు పర్యావరణ నిబంధనలు ఉన్నాయి. 1986 పర్యావరణ నిబంధనల ప్రకారం ద్విచక్రవాహనం నుంచి ట్రాక్టర్ వరకు ప్రతి మోటారు వాహనానికి శబ్ద నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే. సైలెన్సర్ తప్పనిసరిగా ఉండాలి. వాహనం తీసుకున్న ఆరునెలల వరకు 90 డెసిబుల్ బ్రైపాండర్స్ పొజిషన్, 100 డెసిబుల్స్ ఆపరేటర్ లెవెల్ ఉండాలి. రెండున్నర సంవత్సరాల తర్వాత 88 డెసిబుల్స్ బ్రైపాండర్స్ పొజిషన్, 98 డెసిబుల్స్ ఆపరేటర్ లెవెల్స్ ఉండాలి. కానీ కొందరు ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టం వచ్చినట్లుగా సైలెన్సర్లు మారుస్తూ శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారు. కొందరు ఆటోవాలాలు నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లో స్పీకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో జనావాసాల మధ్యనే కొన్ని పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. వాటినుంచి వచ్చే శబ్దాలతో ఆయా ప్రాంతాల్లోని గృహల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సదరు పరిశ్రమల నిర్వాహకుల నుంచి కొందరు అధికారులు మామూళ్లు వెళ్తున్నాయని, అందువల్లనే అలాంటివాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ- చలానా లకే పరిమితం

గతంలో సైలెన్సర్లపై సీరియస్ నోట్ ప్రకటించిన అధికారులు వాటిపై పలుమార్లు స్పెషల్ డ్రైవ్ చేపట్టేవారు. శబ్దానికి హద్దులు లేని వాహనాలను సీజ్ చేయడంతోపాటు జరిమానాలు విధించేవారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. గతంలో ఒకేరోజు 50కి పైగా ద్విచక్రవాహనాలను సీజ్ చేసిన ఘటనలూ ఉన్నాయి. ఇటీవల అధికారులు అలాంటి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించట్లేదు. కేవలం ఆదాయంపైనే దృష్టిసారించిన పోలీసులు ఈ-చలానాపై ఎక్కువ దృష్టిసారించినట్లుగా తెలుస్తోంది. ఈ-చలానాల్లో కేవలం హెల్మెట్, రాంగ్‌రూట్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివి మాత్రమే నమోదవుతాయి. వాటిల్లోనూ నాన్‌కాంటాక్ట్ (కెమెరా) చలానా కేసులే అత్యధికంగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచక్షణారహితంగా హారన్లు, సైలెన్సర్లు వినియోగిస్తున్న వాహనదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

శబ్ద కాలుష్యం కారణంగా గుండె కొట్టుకునే వేగం, రక్తప్రసరణ వేగం పెరుగుతుంది. 65 డెసిబుల్స్ దాటిన శబ్దం వింటే గుండెజబ్బులు వస్తాయి. గుండెపోటు కూడా రావచ్చు. పనిచేసే శక్తిని కోల్పోతాం. చెవుడు కూడా వస్తుంది. నిద్రపట్టదు, తలనొప్పి, అలసిపోతాం. మానసికంగా, శారీరకంగా మనిషిని కుంగదీస్తుంది. పలు శారీరక, మానసిక వ్యాధులకు శబ్ద కాలుష్యం కూడా కారణమవుతాయని వైద్యులుచెబుతున్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

వాహన చోదకులు పరిమితికి మించిన శబ్దం వెలువరించే సైలెన్సర్లను వినియోగించకూడదు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే పోలీసు శాఖ సహకారం తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జరిమానా విధించడంతోపాటు బైకు సైలెన్సర్లను డిస్మాండల్ చేస్తాం. వాహన చోదకులు ప్రభుత్వ నిబంధనలను పాటించి రవాణా శాఖకు సహకరించాలి

- కృష్ణారావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, తూ.గో జిల్లా

రూ.12.92 కోట్లతో 9,493 మందికి లబ్ధి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో మిగిలి ఉన్న అర్హులైన వారిని గుర్తించి ద్వి వార్షిక ప్రణాళిక ప్రకారం వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేసే దిశలో 9,493 మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలుగనుందని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. రు.12.92 కోట్లు మేర ఆర్థిక ప్రయోజనాన్ని మంజూరు చేసి, డిసెంబర్ 27న జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వర్చువల్ ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేస్తారన్నారు. జగనన్న అమ్మఒడి పథకం కింద 1,994 మందికి రూ.2.59 కోట్లు, వైఎస్ఆర్ కాపు నేస్తం పథకం కింద 1,255 మంది లబ్ధిదారులకు రూ.1.88 కోట్లు, వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం కింద 22 మంది లబ్ధిదారులకు రూ.5లక్షలు, వైఎస్ఆర్ వాహన మిత్ర పథకం కింద 343 మంది లబ్ధిదారులకు రూ.34 లక్షలు, వైఎస్ఆర్ చేయూత పథకం కింద 1,044 మంది లబ్ధిదారులకు రూ.1.96 కోట్లు, ఇబిసి నేస్తం పథకం కింద 62 మంది లబ్ధిదారులకు రూ.9 లక్షలు, జగనన్న చేదోడు పథకం కింద 43 మంది లబ్ధిదారులకు రూ.4.30 లక్షలు, వైఎస్ఆర్ మత్స్యకార భరోసా పథకం కింద 15 మంది లబ్ధిదారులకు రూ.2 లక్షలు, జగనన్న వసతి దీవెన పథకం కింద 617 మంది లబ్ధిదారులకు రూ.52 లక్షలు, జగనన్న విద్యా దీవెన పథకం కింద 4,098 మంది లబ్ధిదారులకు రూ.5.43 కోట్లు విడుదల చేస్తారన్నారు.



ప్రేమోన్మాదిపై కఠినచర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కడియం మండలం కడియపులంకలో చోటుచేసుకున్న ప్రేమోన్మాది దాడి ఘటనను రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ దాడిపై రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు కర్రి జయశ్రీరెడ్డి స్పందించారు. పొట్టిలంకకు చెందిన దాసరి వెంకటేష్ కడియపులంకకు చెందిన యువతిని ప్రేమ పేరుతో వేధిస్తూ.. రెండ్రోజుల కిందట యువతి ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో యువతితో పాటు, ఆమె అక్క, తల్లిపై సుత్తితో దాడిచేసి గాయపర్చాడు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళలను ఆదివారం మహిళా కమిషన్ సభ్యులు కర్రి జయశ్రీ రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత మహిళల ఆరోగ్యం మెరుగయ్యేవరకు మహిళా శిశుసంక్షేమ శాఖ పర్యవేక్షించాలని స్థానిక అధికారులకు ఆమె సూచనలిచ్చారు. వారు త్వరగా కోలుకునేలా మెరుగైన అత్యవసర వైద్యం అందించాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను కోరారు. ఈ ఘటనపై తూర్పుగోదావరి జిల్లా ఎస్‌పితో మాట్లాడారు. ప్రేమోన్మాదిని వెంటనే అరెస్టు చేసి కఠినచర్యలు చేపట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావత్తం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిందితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినందున, ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామని ఎస్‌పి ఆమెకు తెలిపారు. మహిళలకు ప్రేమించే హక్కు ఉన్నట్లే.. నచ్చకపోతే నిరాకరించే హక్కు కూడా ఉంటుందని ఆమె చెప్పారు. మహిళల మనోభావాలను అర్థం చేసుకోవడంలోనే సమాజ గౌరవం ఆధారపడి ఉంటుందన్నారు. ఉన్మాదుల నుంచి మహిళలకు సమస్యలు ఎదురైతే పోలీసు స్టేషన్లు లేదంటే 'దిశ' యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆమె వెంట సిడిపిఒ నాగమణి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కడియంతో చలపతిరావుకు అనుబంధం

ప్రజాశక్తి-కడియం

కడియం మండలంతో సినీ నటుడు చలపతిరావుకు విడదీయరాని అనుబంధం ఉంది. ముఖ్యంగా ప్రముఖ నర్సరీ రైతు పల్ల వెంకన్నతో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. అందుకనే జిల్లాలో ఎక్కడ షూటింగ్‌కు విచ్చేసిన ఈ నర్సరీకి విచ్చేసి కొద్దిసేపు వెంకన్నతో గడిపేవారు. అలాగే ప్రముఖ సినీ దర్శకులు ఇవివి.సత్యనారాయణతో చలపతిరావుకు మంచి స్నేహ సంబంధాలు ఉండడంవల్ల ఆయన దర్శకత్వంలో వచ్చిన అన్ని సినిమాల్లోనూ అవకాశం ఇచ్చేవారు. ఇవివి జిల్లాలో చేసిన షూటింగులకు చలపతిరావు పాల్గొని విరామ సమయంలో కడియం విచ్చేసేవారు. ఇవివి పెద్ద కుమారుడు హీరో ఆర్యన్ రాజేష్‌కు ఇదే మండలం జేగురుపాడు అమ్మాయితో వివాహం జరిగింది. అప్పటికే ఇవివి మతి చెందడంతో చలపతిరావే దగ్గరుండి జేగురుపాడులో నిశ్చితార్థం, రాజమహేంద్రవరంలో వివాహాన్ని జరిపించడంలో పెళ్లి పెద్దగా వ్యవహరించారు. అందువల్లనే ఈ ప్రాంత వాసులతో చలపతిరావుకు మంచి పరిచయాలు ఉన్నాయి. చలపతిరావు మతి వార్త తెలియగానే ఆయనతో ఉన్న సంబంధాలను నెమరు వేసుకుంటున్నారు.



ఇవివి, చలపతిరావులతో నర్సరీ రైతు పల్ల వెంకన్న(ఫైల్ ఫొటో)

పుంత రోడ్లు, బోదెలు సర్వే చేయాలి

ప్రజాశక్తి - చాగల్లు

పొలాలకు వెళ్లే పుంత రోడ్లు, మురుగునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పంటబోదెలను సర్వే చేయాలని రైతుల కోరుతున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే నిర్వహిస్తుందన్నారు. అయితే పుంత రోడ్లను, పంటబోదెలను విస్మరిస్తున్నారన్నారు. ఇవి ఆక్రమణలకు గురికావడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షాకాలంలో మురుగునీరు దిగక పంటలు ముంపునకు గురవుతున్నాయన్నారు. వేలాది రూపాయల నష్టం వాటిల్లుతుందన్నారు. సర్వే చేసి పుంతరోడ్లు, బోదెలను యథావిధిగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఉపాధి పనుల్లో భాగంగా వీటిని అభివృద్ధి చేయాలన్నారు.

తొలగింపు వార్తలపై పింఛనుదారుల్లో ఆందోళన

ప్రజాశక్తి - పెరవలి

ప్రభుత్వ కొత్త నిబంధనలతో పింఛన్లు నిలుపుదల చేస్తున్నట్లు ఆయా గ్రామాల్లో సచివాలయాలకు నోటీసులు అందడంతో పింఛన్ లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. విద్యుత్ వాడకం 300 యూనిట్లు, వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ స్థలం, కారు, ఆదాయ పన్ను, సంవత్సరానికి 1.50లక్షలు ఆదాయం దాటినా, కుటుంబంలోని ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేసినా వారికి పింఛనుకు అనర్హులంటూ వేటు వేస్తున్నారు. దీంతో పలువురు లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యథావిధిగా పింఛన్లు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. క్రిస్మస్ కేక్‌లు కట్ చేసి పంచారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించారు. **రాజమహేంద్రవరంలో** అన్ని చర్చిలు విద్యుత్ దీపాలతో కళకళలాడాయి. క్వారీ మార్కెట్ సెంటర్ డాక్టర్ జాన్ వెస్లీ చర్చి, ఆనంద్ రీజెన్సీ ఎదురుగా బైబిల్ మిషన్ కాతెడ్రాల్ చర్చి, రాజమండ్రి రూరల్ బుచ్చయ్య నగర్ బిషప్ లాజరస్ వారి రాక్ చర్చి, ఐఎల్‌టిడి జంక్షన్ ఎపిఫనియా చర్చి, గ్లోరియా డే పారిష్ లూథరన్ చర్చి, బైపాస్ రోడ్డులో డాక్టర్ మల్లిపూడి నెల్సన్ మెమోరియల్ లూథరన్ చర్చి, లాలా చెరువు జాన్ వెస్లీ వారి హోసన్న చర్చి, లాలా చెరువు బైబిల్ మిషన్ చర్చి, ఎవిఎ రోడ్డులో ప్రతాప్ సిన్హా చర్చి, ఆనం కళా కేంద్రం హెూలీ ట్రినిటీ చర్చి, నటరాజ్ థియేటర్ వద్ద దహించు అగ్ని చర్చిలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వీటిలో ఎంపీ భరత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏసు మానవాళి కోసం ఎన్నో త్యాగాలు, బాధలు, అవమానాలు భరించారన్నారు. లోకంలో సమైక్యత, ప్రశాంత జీవనం కోసం ప్రతీ ఒక్కరూ ఏసు నడిచిన మార్గంలో పయనించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరిశుద్ధమైన మనసుతో అందరినీ ప్రేమించడమే ఏసు మార్గమని, అదే క్రీస్తు కోరుకున్నదీ అని ఎంపీ మార్గాని భరత్ పేర్కొన్నారు. ఆయా చర్చిల నిర్వాహకులు ఎంపీకి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. **ఉండ్రాజవరం** మండలంలోని అన్నిగ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వేలివెన్నులో టిడిపి నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు స్వగృహంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రేమ, త్యాగం, కరుణ, క్షమాగుణం వంటి అత్యుత్తమ జీవన మార్గాలను మానవాళికి అందించిన మహా మనిషి ఏసుక్రీస్తు అన్నారు. **ధవళేశ్వరం** ఎన్‌ఎంఇఎల్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొన్నారు. ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. **పెరవలి** మండలంలోని పెరవలి, లంకమాలపల్లి, పిట్టలవేమవరం, కానూరు, కాకరపర్రు, బొక్కవారిపాలెం, ముక్కామల తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



ధవళేశ్వరం చర్చిలో మాట్లాడుతున్న ఆకుల వీర్రాజు



క్రిస్మస్‌వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపీ భరత్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి - ధవళేశ్వరం

ధవళేశ్వరంలోని కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, జెసి, ఇతర జిల్లా అధికారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి వారం తరహాలోనే సోమవారం హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపంలోని ఎన్‌ఎసి భవనంలోని కలెక్టరేట్‌కు ఆర్‌టిసి బస్టాండ్ నుంచి ఉచిత బస్సు సర్వీసు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నడుపుతారన్నారు.



సాయం అందిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

వృద్ధురాలికి మానవత ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అనారోగ్యంతో మంచానికి పరిమితమైన వెలగదుర్రు గ్రామానికి చెందిన ముగ్గళ్ళ సత్యవతికి మానవత ఉండ్రాజవరం శాఖ తరపున రూ.10వేల ఆర్థిక సాయం అందించామని అధ్యక్షులు నందిగం వెంకటకృష్ణపాపారావు తెలిపారు. ఆమె మంచానికి పరిమితమైన కారణంగా కుటుంబ సభ్యులకు నగదును అందించామని ఆయన తెలిపారు. ఆదివారం పాలంగి మానవతా భవనంలో వెంకటకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన నెలవారీ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాలంగి ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ ఉమాకాంత్, సబ్ మేనేజర్ ప్రత్యుష హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.మాణిక్యాలరావు, కోశాధికారి వి.రామకృష్ణ, వెలిచేటి బోసు, మన్నే శ్రీనివాసు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - గోపాలపురం

రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు సమైక్యంగా కలిసి పనిచేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కరాటం సాయి, నియోజకవర్గ నాయకులు దొడ్డిగర్ల సువర్ణ రాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జనసేన పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, నాయకుల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు పోలనాటి రాజేంద్ర అధ్యక్షతన జరిగింది. తొలుత కార్యకర్తల మనోభావాల్ని నాయకులు అడిగి తెలుసుకున్నారు. నాయకుల సహకారం లేని కారణంగానే గ్రామస్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ బలోపేతం కావట్లేదనిఆవేదనను వ్యక్తం చేశారు .అనంతరం జిల్లా కార్యదర్శి కరాటం సాయి మాట్లాడుతూ ప్రతి పార్టీ ప్రారంభంలో పురిటి నొప్పులతో బాధపడిందేనని కార్యకర్తలు ధైర్యంతో నిలబడి ముందుకు సాగాలన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దోపిడీదారుల ప్రభుత్వంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మూడేళ్ల కాలంలోనే ప్రజల అసమ్మతిని చూరగొందన్నారు. ప్రజలు మార్పు కోసం చూస్తున్నారని అది జనసేన పార్టీ ద్వారానే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అచ్యుత సత్యనారాయణ, ఎంటర్పాటి రాజు, పోల్నాటి రాజేంద్ర, పోసిన గణపతి, పనసల వేణు, మాధవి, కవల సీత, పలివెల శ్రీను, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు జనసైనికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నాయకులు



పురస్కారం అందుకుంటున్న నాగబాబు

నాగబాబుకు ఉత్తమ ఉద్యానవేత్త పురస్కారం

కడియం : కడియపులంకు చెందిన నర్సరీ రైతు మల్లు నాగబాబుకు ఉత్తమ ఉద్యాన వేత్త పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లోని ఆలిండియా తెలగ, కాపు, బలిజ సంఘం ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు అందించారు. ఉత్తమ ఉద్యాన పోషకులు ఆకుల వెంకట్రావు పేరిట ఇచ్చే ఉత్తమ ఉద్యాన వేత్త పురస్కారం నాగబాబుకు అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐఎఎస్ అధికారి బి.లక్ష్మీకాంతం, సిద్ధార్థ ఇన్ ఫ్రా టెక్ అండ్ సర్వీసెస్(ఐ) ప్రయివేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బండారు నరసింహరావు, సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు యర్రపోతు ప్రభాకరరావు, తోట హనుమంతరావు చేతుల మీదుగా నాగబాబు అవార్డును అందుకున్నారు. దీనిపట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కార్టూన్'నిజం'



పనిచేయని పథకాలు ఎందుకు..?

రంజాన్ తోఫాను అటకెక్కించారు

బాబు హయాంలోనే ముస్లిములకు న్యాయం

'ఇదేం ఖర్మ మన మైనార్టీలకు' కార్యక్రమంలో టిడిపి నేతలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అమలుకు నోచుకోని, వింత నిబంధనలతో అర్హులను కూడా అనర్హులుగా చూపించే పథకాల వల్ల ముస్లిములకు న్యాయం జరగదని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి భవాని, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, టిడిపి మైనారిటీ సెల్ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక ఆజాద్ చౌక్ వద్ద మైనారిటీ నాయకులు డిల్లు, అహ్మద్, బషీర్, అజీజ్, అదిల్, రబ్బానీ, ఆశారఫ్, సిద్ధిఖ్, ఆఫీజ్, జమీర్, బాబా బషీర్, శవాలి, కమల్, ఫయాజ్ ల ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన మైనార్టీలకు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు పంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం మైనారిటీల కోసం ప్రకటించిన షాదీ తోఫా పథకం విధి విధానాలు అర్థం లేనివన్నారు. మైనారిటీల కుటుంబంలో ఇద్దరు అమ్మాయిలు ఉంటే ఒక్కరికే ఈ పథకం వర్తిస్తుందని పేర్కొనడం సరైన విధానం కాదన్నారు. వివాహం చేసుకునే వధువరులు ఇద్దరూ కచ్చితంగా 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన పెట్టడం సబబు కాదన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల పిల్లలు మధ్యలోనే చదువులు ఆపేసే సందర్భాలు ఉంటాయన్న సంగతి జగన్ ప్రభుత్వం గుర్తించాలన్నారు. వివాహం చేసుకునే ఇరువురి కుటుంబాల ఆదాయం నెలకు గ్రామీణ ప్రాంతంలో అయితే రూ.10 వేలలోపు ఉండాలని, పట్టణ ప్రాంతంలో రూ.12 వేలలోపు ఉండాలని, 3 ఎకరాలకు మించి మాగాని లేదా 10 ఎకరాలకు మించి మెట్ట భూమి ఉండరాదంటూ పెట్టిన నిబంధన అర్థం లేనిదన్నారు. ఇవన్నీ చూస్తుంటే ఈ షాదీ తోఫా పథకాన్ని అసలు ఎవరికీ వర్తించకుండా చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందనేది స్పష్టమవుతుందన్నారు. టిడిపి హయాంలో నిబంధనలు లేకుండా అందరికీ దుల్హన్ పథకాన్ని వర్తింపజేసిన విషయాన్ని గుర్తు చేశారు. రంజాన్ తోఫా పథకాన్ని జగన్ ప్రభుత్వం అటకెక్కించిందని విమర్శించారు. రాజమహేంద్రవరంలో మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు కషితో మసీదుల అభివృద్ధి, షాదీ ఖానాల నిర్మాణం, ముస్లిముల బరియల్ గ్రౌండ్ అభివద్ధికి కృషి చేశారన్నారు. ప్రభుత్వం మారడంతో అవి అమలుకు నోచుకోలేదన్నారు. వచ్చిన నిధులను జగన్ ప్రభుత్వం వెనక్కి మళ్లించి అభివద్ధి పనులు జరగకుండా ఆపేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ద్వారా పార్వతిసుందరి, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు యాళ్ల ప్రదీప్, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ కార్యదర్శులు మహబూబ్ ఖాన్, బంగారు నాగేశ్వరరావు, బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి అట్టాడ రవి, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ఇదేం ఖర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ, నాయకులు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కొవ్వూరు రూరల్ : కొవ్వూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా వున్న రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరు హెల్పర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేశామనిసమగ్ర శిశు సేవ అభివృద్ధి అధికారి మమ్మీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నందమూరు -2, అరికరేవుల -3 కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తల రెండు పోస్టులు, అశోక్ పబ్లిక్ స్కూల్ (వార్డ్.14), దొమ్మేరు -4, ఉటలంక కాకుండా (8వ వార్డు), 2వ వార్డు పార్కు వద్ద, బంగారం పేట, వాడపల్లి-3 కేంద్రాల్లో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు భర్తీ చేస్తామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు జనవరి 3లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు


గోడౌన్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ సత్తి సూర్యనారాయణరెడ్డి

గొడౌన్‌ను ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - బిక్కవోలు

కొంకుదురులో రూ.24 లక్షలతో నిర్మించిన కొంకుదురు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన గొడౌన్‌ను అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వరుపుల సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రైతులు ఎక్కువగా ఉన్న ప్రాంతం కాబట్టి ఈ గోడౌన్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ సత్తి నాగిరెడ్డి(రాజా), జడ్‌పిటిసి సభ్యులు రొంగల పద్మావతి, సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపిటిసి సభ్యులు పివి, పందలపాక పిఎసిఎస్ ప్రెసిడెంట్ ప్రసాద్ రెడ్డి, మహేంద్రవాడ సొసైటీ అధ్యక్షుడు తాడి వీరవెంకటసత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు

వంతెనకు ఎంఎల్ఎ జ్యోతుల శంకుస్థాపన

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం మండలం కృష్ణునిపాలెం పంచాయతీ సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, జోగేశ్వరావు దంపతుల ఆధ్వర్యంలో ముసిరిమిల్లి కాలుపై వంతెన నిర్మాణానికి జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.39 లక్షలతో దీన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చంటిబాబు మాట్లాడుతూ కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని కృష్ణుని పాలెం, రామన్నపాలెం, కొత్తూరు, వెంకటాపురం తదితర గ్రామాల్లో రైతులు వంతెన లేక నానా ఇబ్బందులు పడేవారన్నారు. సర్పంచ్ ఆదిలక్ష్మి ఈ సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. అధికారులతో మాట్లాడి సిఎస్ఆర్ నిధులు రూ.39 లక్షలు మంజూరు చేసి నిర్మాణపనులకు శంకుస్థాపన చేశామన్నారు. పనులు వెంటనే మొదలు పెట్టాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. వంతెన నిర్మాణం పూర్తి అయ్యేవరకు నీటి ఇబ్బందులు లేకుండా కాలువను పక్కకు మళ్లించి నీటిని వదలాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగరమేష్, సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు మార్కెట్ యార్డ్ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, జగ్గంపేట ఎంపిపి అత్తులూరి నాగబాబు, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, వైస్ ఎంపిపి మడికి మైనర్ బాబు, నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

జోషితకు నేతల ఆశీర్వచనాలు

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల కు చెందిన టిడిపి నాయకులు సఖుమల్ల ఆది పట్టాభి రామన్న(రాముడు) మనుమరాలు సఖుమల్ల ప్రకాశరావు, మణి దంపతుల జ్యేష్ఠ కుమార్తె జోషిత పుష్పాలంకరణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు ఆదివారం ముఖ్య అతిథిగా విచ్చేసి జోషితకు ఆశీర్వచనాలు అందజేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, టిడిపి మండల అధ్యక్షుడు మెర్ల గోపాల స్వామి, నేతలు ఆకుల రామకృష్ణ, నైనాల శ్రీరామచంద్రమూర్తి, బల్ల హరి, రామానుజుల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.


దుళ్లలోనూతనంగా నిర్మించిన పశువైద్యశాల భవనం

నిరుపయోగంగా పశువైద్య శాల

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల గ్రామంలో చెరువుగట్టుపై గల గ్రామీణ పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ భవనాన్ని పూర్తిగా తొలగించి, అదేచోట నాబార్డు నిధులు సుమారు రూ.27.5 లక్షలతో నూతన పశు వైద్యశాల భవన నిర్మాణ పనులు 2018లో మొదలుపెట్టారు. అనతి కాలంలోనే అధిక శాతం భవన నిర్మాణం పూర్తయ్యింది. భవనం రక్షణలో భాగంగా గుమ్మాలకు, కిటికీలకు తలుపులు ఏర్పాటు చేసి, ఫ్లోరింగ్ తదితర కనీస వసతులు సమకూర్చాల్సి ఉంది. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూడేళ్లగా పశువైద్యశాల నిరుపయోగంగా ఉందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. 2018 లోనే పశు వైద్యశాలకు తాత్కాలికంగా గ్రామంలో బైపాస్ రోడ్ నందు గల పాత పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేటాయించారు. అనంతర పరిణామాల్లో ఈ భవనంలోనే నూతనంగా సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇదే భవనంలో రైతు భరోసా కేంద్రం కూడా ప్రారంభించారు. అధిక శాతం పనులు పూర్తయ్యిన పశువైద్యశాల నూతన భవనం అక్కడ ఖాళీగా దర్శన మిస్తుండగా, మూడు కార్యాలయాల సిబ్బంది కార్యకలాపాలతో ఇక్కడ పాత పంచాయతీ కార్యాలయ భవనం కిక్కిరిసి కనిపిస్తోంది. దీనితో వివిధ పనులపై సచివాలయానికి వచ్చే ప్రజలు, ఆర్‌బికెకు వచ్చే రైతులు, పశువులను వైద్యశాలకు తీసుకురావాల్సిన పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు కనీసం స్పందించలేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

దీనిపై వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణ(కడియం)ను వివరణకోరగా పశువైద్యశాల నూతన భవన నిర్మాణ గుత్తేదారునికి బిల్లులు చెల్లింపులు జరగలేదని తెలిసిందన్నారు. ఈ భవనం విషయాన్ని మూడేళ్లగా ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామని బదులిచ్చారు.

తీవ్ర ఇబ్బందులుపడుతున్నాం

సచివాలయంలో పశువైద్యశాల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వైద్యం నిమిత్తం పశువులను తీసుకు వచ్చినప్పుడు ఖాళీ లేక అవస్థలు పడుతున్నాం. తక్షణం నూతన పశువైద్యశాల భవనంను వినియోగంలోకి తేవాలి.

-ముళ్లపూడి సత్యనారాయణ, దుళ్ల పశుపోషకులు

చేనేత రంగం అభివృద్ధికి కృషి

చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు పెద్దిరాజు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లాలో చేనేత కార్మికుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత జౌళి శాఖ ద్వారా పలు కార్యక్రమాలను అమలు చేస్తుందని ఆ శాఖ జిల్లా సహాయ సంచాలకులు కురెళ్ల పెద్దిరాజు తెలిపారు. చేనేత రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్మికుల అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన ప్రజాశక్తికి వివరించారు.

జిల్లాలో చేనేత సహకార సంఘాలేన్ని, వాటి ఉత్పత్తి ఎంత.?

జిల్లాలో 18 చేనేత సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. వీటి పరిధిలో 4,500 మగ్గాలు ఉన్నాయి. ఇందులో సహకార రంగంలో 1,500, సహకారేతర రంగంలో 3వేల వరకూ మగ్గాలున్నాయి. చేనేత సహకార సంఘాల ఉత్పత్తి విలువ రూ.1.6కోట్లు ఉంది. వీటి అమ్మకాల విలువ రూ.1.22కోట్లుగా ఉంది.

ఆప్కో బకాయిలు ఎంత ఉన్నాయి.?

జిల్లాలో ఉన్న 18 చేనేత సహకార సంఘాలకు సుమారు రూ.70 లక్షల బకాయిలు ఉన్నాయి. ఇందులో అధికంగా పెద్దాపురం గల చేనేత సంఘానికి రూ.35 లక్షల బకాయి ఉంది.ప్రభుత్వం త్వరలోనే వీటిని విడుదల చేయనుంది.

పాలక వర్గాలు ఎలా పనిచేస్తున్నాయి.?

జిల్లాలో అన్ని సొసైటీల పరిధిలో 2018 ఫిబ్రవరితో పాలక వర్గాల గడువు ముగిసింది. అప్పటి నుంచి తాత్కాలిక పాలక వర్గాలు నడుస్తున్నాయి. త్వరలో మళ్ళీ ఎన్నికలు నిర్వహిస్తాం.

వైఎస్ఆర్ నేతన్న నేస్తం ఎలా అమలవుతోంది.?

వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తుంది. దీనిలో భాగంగా మగ్గం కలిగి, నేత మీద జీవిస్తున్న కార్మికుల కుటుంబానికి ఒక్కొక్కరికి నెలకు రూ.2 వేలు చొప్పున సంవత్సరానికి రూ.24 వేలు అందజేస్తున్నాం. గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా సర్వే జరుగుతుంది. 2022-23లో 2,676 మందికి రూ.6కోట్ల 47లక్షల 24 వేలు ఈ ఏడాది ఆగస్టులో పంపిణీ చేశాం.

త్రిఫ్ట్ ఫండ్ పథకం కోసం వివరిస్తారా...

సొసైటీలో నమోదై నేత నేసిన ప్రతి కార్మికుడు మజూరీలో 8 శాతం పొదుపు చేస్తే మరో 16 శాతం జోడించి మొత్తం 24 శాతం ప్రభుత్వం ఈ పథకం ద్వారా కార్మికులకు



అందిస్తుంది. అలాగే సంఘాలకు 40 శాతం సబ్సిడీను కూడా ఇస్తుంది. సంఘాల ద్వారా దుస్తులు అమ్మకాలు జరిపితే 30 శాతం రీబేటు కూడా ఉంటుంది.

చేనేత పరికరాల పంపిణీ ఎలా ఉంది?

జిల్లాలో 3 క్లస్టర్లు నడుస్తున్నాయి. వీటిలో ఉప్పాడ కాకుండా కొత్తగా ప్రత్తిపాడు, గొల్లప్రోలు క్లస్టర్లను ఏర్పాటు చేశాం. సుమారు 900 మంది లబ్ధిదారులను గుర్తించాం. వీరికి వివిధ పరికరాలను, చేనేత పనిముట్లను అందజేస్తాం.

మార్కెటింగ్ ఇన్సెంటివ్ పథకం ప్రయోజనాలు ఏమిటి.?

ఈ పథకం ద్వారా చేనేత వస్త్రముల అమ్మకాలపై 20 శాతం రాయితీ ఇచ్చి అమ్మకం పెరిగేటట్లు చూసి దీనిద్వారా సభ్యులకు నిరంతరం పని కల్పించడమే పథక ముఖ్య ఉద్దేశం.ఈ పథకం ద్వారా చేనేత సహకార సంఘాలలో చేసిన వస్త్రాల అమ్మకాలపై రాయితీని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో భరిస్తుంది.

నూలు సబ్సిడీ పథకం ఎలా అమలవుతుంది

రాష్ట్ర ప్రభుత్వము ఈ పథకము ద్వారా 20 శాతం సబ్సిడీని నాణ్యమైన చీలప నూలు, రంగులు, రసాయనాలు అప్కో ద్వారా చేనేత సహకార సంఘాలకు సరఫరా చేస్తుంది.

గోతులమయంగా ప్రధాన రహదారులు

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

ప్రమాదాలు చోటుచేసుకుంటున్న వైనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం నియో జకవర్గం లోని పలు మెయిన్ రోడ్లు రహదారులు అధ్వానంగా తయారై ప్రయాణికులకు ప్రజలకు అసౌకర్యంగా ఉంటున్నాయి. మెయిన్ రోడ్లు పూర్తిగా పాడవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రయాణికులకు ప్రాణ సంకటం గా మారిన ఈ రోడ్లు గత ఐదేళ్లుగా ఎన్ని మొరలు పెట్టిన పునర్నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే రామచంద్రపురం నియోజకవర్గంలోని ద్రాక్షారామ-రామచంద్రపురం మెయిన్ రోడ్డు ద్రాక్షారామ-యానాం మెయిన్ రోడ్డు పూర్తిగా పాడై గోతులు పడ్డాయి. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా రాళ్లు లేచిపోయి ఉన్నాయి. అదేవిధంగా ద్రాక్షారామ నుంచి యానాం వెళ్లే మెయిన్ రోడ్డు పొడవునా గోతులు ఏర్పడి పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి సుమారు 20 కి.మీ పొడవు ఉండే రోడ్డు ఐదేళ్లుగా మొత్తం పాడయింది. ఇటీవల రోడ్డు నిర్మాణం పేరుతో మరమ్మతులు చేపట్టినా పనులు పనులు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయి. అసలు ఈ రోడ్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని ప్రయాణికులు పరిసర గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ద్రాక్షా రామా, రామచంద్రపురం, తాళ్ల పొలం, జగన్నాయకుల పాలెం, వేలం పాలెం, వేగాయ మ్మపేట, ఎర్ర పోతవరం, బాలాంతరం, కుయ్యేరు, ఉప్పు మిల్లి, కోలంక, కాపులపాలెం వరకు గల అన్ని గ్రామాలకు ఈ మెయిన్ రోడ్డు ప్రధానాధారం. వీటితోపాటు శివల మెయిన్ రోడ్డు. దంగేరు మెయిన్ రోడ్డు పూర్తిగా పాడై ఉన్నాయి. ఈ రోడ్డును వెంటనే ఆధునికీకరించాలని సంబంధిత గ్రామాల ప్రజలు ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

పనులు ఆలస్యం కావొచ్చు

రామచంద్రపురం-ద్రాక్షారామ-యానాం వెళ్లే మెయిన్ రోడ్డు ఆధునికీకరణ పనులు నిలిచిపోయాయని రోడ్డు పూర్తిగా పాడే గోతుల్లో కంకర లేచిపోయిందని రహదారి భవనాల శాఖ డిఇ వెంకటేశ్వరరావుని వివరణ కోరగా ఈ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయన్నారు. అయితే మండపేట వద్ద రోడ్డు పనులు జరుగుతున్నాయని అదే కాంట్రాక్టర్ ఈ రోడ్డు నిర్మించవలసి ఉందని మండపేటలో రోడ్డు పనులు పూర్తయితే కానీ ఈ రోడ్డు పనులు ప్రారంభించరన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పనులు మరింత ఆలస్యం కావచ్చు అని వివరించారు.


ద్రాక్షారామ-రామచంద్రపురం మెయిన్‌రోడ్డు దుస్థితి


ఛిద్రమైన ద్రాక్షారామ-యానాం రోడ్డు


వేగాయమ్మ వద్ద గోతుల పడిన రహదారి

ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం



ద్రాక్షారామ-యానాం రోడ్డు, రామ చంద్ర పురం- ద్రాక్షారామ రోడ్డు గత ఐదేళ్లుగా పాడై ఉండడంతో నిత్యం ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసిన రోడ్డు ఆధునికరించడం లేదు. దీంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, రాజకీయ నాయకులు వెంటనే స్పందించి ఈ రోడ్డును ఆధునికీకరించాలని కోరుతున్నాం.

-ఎం.నాగేశ్వరావు,మాజీ ఎంపిటిసి సభ్యుడు

రోడ్డును వెంటనే ఆధునికీకరించాలి



ద్రాక్షారామ-యానాం రహదారిలో ప్రయాణికులు నిత్యం ఇక్కట్లు గురవు తున్నారు. ఈ రహదారిపై రాళ్లు పైకి లేచిపోయి బూడిద రావడంతో ఎదుటి గా వెళ్లే వాహనాలు కనిపి ంచడం లేదు. ప్రతిరోజు ముక్కు మూసుకుని ప్రయాణించాల్సి వస్తుంది, వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అధికారులు స్పందించి ఈ రోడ్డును ఆధునికరించాలని కోరుతున్నారు.

-కాటే శ్రీనివాస్, ప్రయాణికులు

పంట కాలువను ఆధునికీకరించాలని వినతి

ప్రజాశక్తి -రామచంద్రపురం

మండలంలోని వెల్ల గ్రామంలో పంట కాలువ పూర్తిగా పూడుకుపోయిందని దీనిని ఆధునీకరించాలని గ్రామ రైతులు, ఎంపిటిసి సభ్యులు కోరుతున్నారు. గ్రామానికి ఆనుకుని ఉన్న పంట కాలవలో గ్రామస్తులు చెత్తా చెదారం, వ్యర్థాలను వేయడంతో పాటు. అరుంధతీ పేటలోని మురుగు నీరు పంట బోదె లోనికి వచ్చేలా కాలువ నిర్మించారు. ఇదే అదునుగా నూతన గృహాలు నిర్మించుకున్నవారు పంట బోదెలోనికి మురుగు నీరు వదులుతున్నారు. దీనితో పంట బోదె మొత్తం, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా మిగిలిపోయిన ఆహార పదార్థాలు, చెత్తతో నిండి పోయి పూర్తి దుర్వాసన వెదజల్లుతోంది. బోదె మురికి నీరుతో నిండి పోయింది. జలగలు, తెల్లటి పురుగులు, క్రిమి కీటకాలతో నిండి పోయి నీరు ప్రవహించక రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. మురుగు నీటిలో దిగి బాగు చేయడానికి రైతులు. కూలీలు ఎవరుసాహసించకపోవడంతో ఆ బోదె కు సంబంధించి 70 ఎకరాల పంటభూమి నీటి ఎద్దడని ఎదుర్కొంటోంది. పురుగులు చేలల్లోకి కూడా ప్రవేశించి న కారణంగా ఆ 70 ఎకరాల భూమికి సంబంధించిన వ్యవసాయ పనులకు కు ఎవరూ రావడం లేదు. పంచాయతీ వారికి ఎండిఒ ఆఫీసులో దీని గురించి ఫిర్యాదు చేసిన ఫలితం లేదని రైతులు చెబుతున్నారు. కలెక్టర్ ఇక్కడకు వచ్చినప్పుడు ఈ సమస్య గురించి తెలియజేశామని, ఎంపిటిసి సభ్యుడు చిక్కాల స్వామి తెలిపారు. ఈసమస్య నుపరిష్కరించాలని సంబంధిత అధికారులు వెంటనే ఈ సమస్య పై స్పందించాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు. లేకుంటే పంటవిరామం ప్రకటించడం తప్ప వేరే గత్యంతరం లేదని పలువురు రైతులు వాపోయారు.


చెత్తతో నిండిన పంట కాలువ

కంకరకు రూ.80 వేల చెల్లింపుపై సభ్యుల ఆగ్రహం

తోటపేట పంచాయతీలో మూడు నెలలుగా ఖర్చులు చెప్పని అధికారులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్ర పురం మండలం లోని తోటపేటలో డంపింగ్ యార్డ్ కు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రోడ్డుకు మూడు లారీలు కంకర వేసి రూ.80వేలు బిల్లు చెల్లించడంపై వార్డు సభ్యుల ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ సమావేశంలో మూడు నెలలుగా ఖర్చులు చెప్పమని గ్రామ కార్యదర్శి నిలదీయగా ఈ నెల 30 వరకు గడువు కావాలని కార్యదర్శి భాస్కర్ లక్ష్మి వార్డు సభ్యులకు వివరించారు. గ్రామపంచాయతీ సమావేశంలో వార్డు సభ్యులు కాటే శ్రీను. ఇల్ల సూరిబాబు. కోట శ్రీనివాసరావు. మేర్నిడి శ్రీనివా స్‌లు పలు ప్రశ్నలు లేవనెత్తారు డంపింగ్ యార్డ్ కి వెళ్లేందుకు వేసిన కంకర కనిపించడం లేదని రోడ్డు అధ్వానంగానే ఉందని రూ.80వేలు బిల్లు చెల్లించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటుగా ఇక్కడ నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రం ఎప్పటి వరకు పని చేయడం లేదని నిరుపయోగంగా ఉందని పంచాయతీలో చేస్తున్న ఖర్చులు వార్డు సభ్యులు కూడా చెప్పకపోవడం పై వారు విమర్శించారు. తాము గెలుపొందిన నాటి నుంచి ఇప్పటి వరకు పంచాయతీ ఖర్చులు ఆదాయం వివరాలు చెప్పకుండా గోప్యంగాఉంచడంపై వార్డు సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు వీటన్నిటికీ వెంటనే పంచాయతీ అధికారులు సరైన సమాధానం చెప్పాలని వారు కోరుతున్నారు.


రూ.80వేల తో కంకర వేయించిన రోడ్డు ఇదే..

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి -కాట్రేనికోన

వైసిపి పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప చేసిందేమీ లేదని, అభివృద్ధి శూన్యమని మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు విమర్శించారు. ఆదివారం చెయ్యేరులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల టిడిపి అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జగన్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అక్రమాలను వివరిస్తూ ప్రచారం చేశారు. మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, రాష్ట్ర టిడిపి కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి గుత్తులు సాయి నాయకులు చెల్లి అశోక్, చెల్లి సురేష్, సుధా బాబురావు, మంతెన శ్రీనివాసరాజు, త్సవటపల్లి నాగేంద్ర, నామా వెర్రిబాబు, త్సవటపల్లి శ్రీను, నంద్యాల వెంకటేశ్వ రరావు, కముజు లక్ష్మీ రమణారావు, విత్తనాల బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

పందుల స్వైరవిహారం..

ప్రజాశక్తి -రామచంద్రపురం

రామచంద్రపురం నుంచి వెల్ల గ్రామం వెళ్లే మెయిన్ రోడ్డు దుర్భరంగా ఉంది. ఈ రోడ్డు పొడవునా రోజురోజుకూ చెత్తాచెదారం పెరిగిపోతోంది మండలంలోని పలు గ్రామాల నుంచి చెత్తాచెదారం తీసుకువచ్చి ఈ రోడ్డు వెంబడి వేయడంతో ఇక్కడ రోజురోజుకు చెత్త కొండలా పెరుగుతుంది. రోడ్డు వెంబడి రోజురోజుకు పెరిగిపోతున్న చెత్తతో దుర్వాసన వెదజల్లి అటు వెళ్లే ప్రయాణికులంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు వెంబడి పందుల స్వైర విహారం చేస్తున్నాయి. ఒకవైపు చెత్తాచెదారం మరోవైపు పందల సంచారంతో ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రయాణికులు పరిసర గ్రామస్తులు ఇక్కట్లకు గురికావాల్సి వస్తోంది. దీనిపై ఇటీవల మండల పరిషత్ సమావేశంలోనూ సభ్యులు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. జెసిబిలతో చెత్త తొలగించాలని సూచించారు అయితే ఇది అమలకు నోచుకోలేదు వెంటనే రోడ్డు వెంబడి ఉన్న చెట్టను తొలగించాలని, పందుల సంచారాన్ని అరికట్టాలని వెల్ల గ్రామస్తులు పరిసర ప్రాంతాల ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.


వెల్ల గ్రామం వెళ్లే రోడ్డులో చెత్త, సంచరిస్తున్న పందులు

నేరాలు ఘోరాలు

పరిస్థితి విషమించి యువకుని మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పురుగుమందు తాగి కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కందుకూరి చిట్టిబాబు(22) పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. బిక్కవోలుకు చెందిన చిట్టిబాబు కుటుంబం కొంతకాలంగా బంధు వుల ఊరైన పెద్దాపురం మండలం రాయ భూపాలపట్నంలో నివాసముంటున్నారు. ప్రతి రోజూ మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లిదండ్రులు చిట్టిబాబును మందలించారు. కోపంతో చిట్టిబాబు ఈనెల 18న పురుగుల మందు తాగాడు. ప్రాథమిక చికిత్స అనంతరం అతన్ని కుటుంబ సభ్యులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

కల్లు పాక దగ్ధం

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

కొవ్వూరు మెరకవీధి సమీపంలో ఆదివారం బల్ల వెంకన్నకు చెందిన కల్లుపాక దగ్ధమైంది. ధూమపానం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారి కె.రాముడు తెలిపారు. కల్లుపాకతో పాటు, మోటార్ సైకిల్ కాలిపోయింది. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. అగ్ని మాపక శాఖ సిబ్బంది మంటలను ఆర్పేశారని తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తిరుమాలి శివారు ఏలేరు కాలువ గట్టుపై పేకాట ఆడుతున్న ఐదుగురిని ఏలేశ్వరం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఏలేశ్వరం ఎస్ఐ సిహెచ్.విద్యా సాగర్ మాట్లాడుతూ పేకాట, గుండాట, కోడిపందేలు, కోతబంతి వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్ప వన్నారు. అదుపులోకి తీసుకున్న వారి నుంచి రూ.2,100 నగదును స్వాధీనం చేసుకున్నామ న్నారు. నిందితులను సోమ వా రం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

కానిస్టేబుల్ చేతికి గాయం

ప్రజాశక్తి - కొత్తపేట

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని రక్షించిన కానిస్టేబుల్‌కు చేతికి గాయమైంది. స్థానిక గౌతమి నగర్ నుంచి ఆదివారం మధ్యాహ్నం 112కు కాల్ రాగా పోలీస్ స్టేషన్ లో అందుబాటులో ఉన్న పిసి ఎస్‌టిఎల్.ప్రసాద్, మరో పిసి ఘటనా ప్రదేశానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ కముజు సత్తిబాబు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని గ్యాస్ సిలిండర్ లీక్ చేసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే కానిస్టేబుల్ ప్రసాద్ తలుపులు పగలగొట్టి సత్తిబాబును కాపాడుతుండగా ప్రమాదవశాత్తు అతని చేతిలో ఉన్న చాకు కానిస్టేబుల్ కుడి చేతికి తగిలి గాయమైంది. ప్రసాద్ చికిత్సకోసం ఏరియా ఆస్పత్రికి వెళ్లారు.

మహారాజశ్రీ 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, రాజమహేంద్రవరం

M.V.O.P.92/2020

బిట్వీన్:

కనకాల సింగారావు ...పిటిషనర్

మరియు

Md. ఇస్మాయిల్ మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

నోటీసు

టు

R2) నార్ని వరలక్ష్మి, భర్త వెంకటేశ్వరరావు, హిందువు, వయస్సు 42 సం॥లు, APSRTC Bus నెం.ఎ.పి.05.టి.సి.8558 ఓనర్, డోర్‌నెం.27-4-29/2, గనుగుమల్ల వారి వీధి, రామచంద్రపురం, ఈస్ట్ గోదావరి జిల్లా.

పై నెంబరు గల పిటిషన్‌లో పిటిషనర్ ఇన్సురెన్స్ క్లైమ్ కోరుతూ పిటిషన్‌ను దఖలు చేసి యున్నారు. సదరు పిటిషన్‌లో శ్రీకోర్టు వారు మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేస్తున్నందున శ్రీకోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు ఆర్డరు వేసినారు. కావున సదరు పిటిషన్ ది.03-01-2023 తేదీన వాయిదా అయి వున్నది. ఈ వాయిదా తేదీన ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలను తెలుపు కోవలెను. లేనియెడల పై కేసు విచారణను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును ఇందు మూలంగా మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు మేరకు)

K.VISHNU PRIYA
Advocate, Rajahmundry.
Cell: 9398404352, 8801606854

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.No. 6/2021

Between:

Shaik Gouse ***...Petitioner***

AND

1) Patchamatla Ramana Murthy, S/o. Rama Krishnam Raju, Hindu, Business, age 53 years, D.No. 1-4-1/2, Ward No. 23, Vanacharla Vari Street, Savaram Road, Amalapuram, Dr.B.R.Ambedkar Konaseema Dist.

2) Patchamatla Sree Subrahmanya Rajeswari, D/o. Ramana Murthy, Hindu, Inam, age 24 years, D.No. 1-4-1/2, Ward No. 23, Vanacharla Vari Street, Savaram Road, Amalapuram, Dr.B.R.Ambedkar Konaseema Dist.

3) Gandham Rajesh, S/o. Late Nageswara Rao, Hindu, Inam, age 32years, D.No. 2-88, Golakotivaripalem, H/o. Modekurru, Kothapeta Mandal.

...Respondents

ఈ నెంబర్‌లో పై రెస్పాండెంట్స్‌ను Insolvent గా Declare చేయించుమని కోరుచూ ఈ I.P. దాఖలు చేసినారు. I.P. **ది.28-12-2022** సంవత్సరం తేదీకి **వాయిదా అయి ఉన్నది.** సదరు I.P.లో ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నచో 28-12-2022 తేదీన హాజరయ్యి ఆక్షేపణలు తెలుపుకోవచ్చును.

వాయిదా తేదీ : 28-12-2022

చింతపల్లి అజయ్ కుమార్
అడ్వకేటు, అమలాపురం.
సెల్: 98498 64699